క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు:ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోరపు కొత్తవలసలో గురువారం డాక్టర్ వి. స్రవంతి వైద్యాధికారి ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్యాన్సర్ని గుర్తించడం, క్యాన్సర్ ఏరకంగా వస్తుంది అనే విషయాలు మరియు సిగరెట్లు, బీడీ త్రాగడం, మద్యపానం సేవించడం, పొగాకు వంటి ఉత్పత్తులు నమలడం, అనారోగ్య కరమైనటువంటి ఆహార పదార్థాలు తినడం, పొగ ఎక్కువగా వచ్చే ఫ్యాక్టరీల్లో పనిచేయడం వంటి చర్యల ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలియజేసారు మంచి ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా క్యాన్సర్ నిరోధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి వి గిరిబాబు, ఏం పి హెచ్ ఓ బి. మురళి గ్రామ ప్రజలు, ఎం రాజేశ్వరి ఏఎన్ఎం, జైయాశీల రాజు, జయరాజు, భారతి ఆశ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఘనంగా 75వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గొప్ప సేవా దృక్పథంతో, జాతికి విశేష సేవలను అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, విశేష ప్రతిభ చూపిన 10మంది స్కౌట్స్, గైడ్స్‌కు రాజ్యపురస్కార్ సర్టిఫికేట్లను బహూకరించి, వారిని అభినందించారు. స్కౌట్స్ ప్రదర్శించిన విన్యాసాన్ని తిలకించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్స్ మరియు గైడ్స్ సేవలను కొనియాడారు. సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్న ఈ సంస్థకు అత్యంత ప్రాముఖ్యత ఉందని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతి విద్యార్థులను ఈ ఉద్యమంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా విద్యాశా ఖాధికారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఛీఫ్ కమిషనర్ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్ననాటినుంచే దేశభక్తిని పెంపొందించేం దుకు దోహదపడుతుందని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి.చిన్నంనాయుడు ఈ ఉద్యమ చరిత్రను వివరించారు. కొత్తవలస జెడ్పి ఉన్నతపాఠశాల విద్యార్థి ఆర్‌డి సోమేశ్వరరావు రాజ్యపురస్కార్ పురస్కారానికి ఎంపికై, గవర్నర్ చేతులమీదుగా అందుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసి బోర్డు కార్యదర్శి సన్యాశిరాజు, జిల్లా స్కౌట్స్ కమిషనర్ ఈపు విజయకుమార్, గైడ్స్ కమిషనర్ సౌభాగ్యలక్ష్మి, ఇతర ప్రతినిధులు, హెడ్‌మాష్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. పలు పాఠశాలల విద్యార్థులకు రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లు పొందారు.

జగన్మోహన్ రెడ్డి ఒక నియంతృత్వ వాది

ఎమ్మెల్యే కళా వెంకటరావు ఫైర్

విశాలాంధ్ర-చీపురుపల్లి : వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు నియంతృత్వ పాలన అవలంభించారని చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు అన్నారు. గురువారం చీపురుపల్లి లో గల క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక మంచి ప్రభుత్వం ఏర్పాటుతో జనాలు సుఖసంతోషాలతో ఉండడం చూసి జగన్మోహన్ రెడ్డి తట్టుకోలేక పోతున్నాడన్నారు.పోలీసులు మీద మాట్లాడే హక్కు జగన్మోహన్ రెడ్డి కి లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఒక నియంతృత్వ వాది అని అన్నారు. ఢిల్లీలో ఇద్దరు ఎంపీలు ఉన్నా వాజపేయి పార్లమెంట్ కి వెళ్ళలేదా? జగన్ రెడ్డి అని ప్రశ్నించారు. జగన్ ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదు నియంతృత్వంలో పెరిగి నియంతృత్వ వాదిగా సీఎం గా పురపాలన చేసిన వ్యక్తి జగన్ అని అన్నారు. 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు చంద్రబాబు అసెంబ్లీకి వెళ్లారు కదా,మరి నువ్వు ఎందుకు అసెంబ్లీ కి రావడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో దన్నాన రామచంద్రుడు కోట్ల మోతిలాల్ నాయుడు తిరుమల రాజు కిరణ్ సారిపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ విచారణపై రెవెన్యూలో కలకలం

సమస్యాత్మకంగా మారిన స్థలం ఇదే..

విశాలాంధ్ర-జామి: గతంలో పనిచేసిన ఆర్‌డివోతో పాటు జిల్లాలోని నలుగురు తహశీల్దార్‌లపై ప్రభుత్వం విచారణ చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈవిచారణ ఎదుర్కొంటున్న వారిలో గతంలో జామి తహశీల్దార్‌గా పనిచేసిన నీలకంఠరావు ఉండడంతోపాటు జామి మండలానికి సంభందించిన అంశం కావడంతో మండల రెవెన్యూలో చర్చకు దారి తీసింది. వాస్తవానికి మండలంలోని భీమసింగి రెవెన్యూలోని సర్వే.నెం.414లో కొత్త భీమసింగి సమీపంలో ఉన్న ప్రభుత్వభూమిని దశాబ్దాల క్రితం ఓ మిలటరీ జవాన్‌కు కేటాయించారు. ఆయన మరణాంతరం వారి వారసులు ఈభూమిపై హక్కుల కోసం ప్రయత్నించారు. ఈనేపథ్యంలోనే అప్పటి తహశీల్దార్‌గా ఉన్న నీలకంఠరావు అప్పటికి ఉన్న వాస్తవ పరిస్థితిని నివేదికగా పంపించారని సమాచారం. అనంతరం అప్పట్లోనే ఆయనకు నోటీసులు రాగా అందుకు తగిన సమాధానం కూడా ఆయన ఇచ్చినట్లుగా తెలిసింది. ఇదే విషయంలో తహశీల్దార్‌పై విచారణ జరుగుతుందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి. ఈకథ ముగిసిందని ఆనాడే అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో జరిగిన ఇటువంటి అంశాలపై దృష్టి సారించి పునర్‌విచారణ చేస్తోంది. అందులో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ విచారణాధికారిగా విచారణ చేయాలని ఆదేశించింది. అయితే ఈవిషయం మండలంలో సంచలనంగా మారింది.

రోడ్ల పైన పశువులను వదిలితే కఠిన చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో మున్సిపల్ రోడ్లుపై పశువుల యజమానులు విచ్చలవిడిగా పశువులను వదిలితే జరిమాల విధిస్తామని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి హెచ్చరించారు. కమిషనర్ ఎల్. రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డ్ శానిటేషన్ ఎండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ మరియు వార్డ్ ఏమినిటీ సెక్రటరీలతో జూబ్లీ రోడ్డు, మెయిన్ రోడ్డు, శ్వేతాచలపతి స్కూల్ రోడ్డు, తాండ్రపాపారాయ బొమ్మ రోడ్డు మరియు మార్కెట్ రోడ్డు ఏరియాలలో పర్యటించారు. జూబ్లీ రోడ్డులో పశువుల పెంపకం దారులు పశువులను విచ్చలవిడిగా రోడ్ల పైన వదిలి వేయడం వలన రోడ్లపై పేడలు వేసి ప్రజాజీవనమునకు అంతరాయం కలిగిస్తున్నట్లుగా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా పశువుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేసి వారిపై చార్జి సీట్లు ఫైల్ చేయాలని ఆదేశించారు. శ్వేతా చలపతి స్కూలు వద్ద చెత్తలను వేస్తున్న వారిని గుర్తించి జరిమా నా విధించాలని ఆదేశించారు. తాండ్రపాపారాయ బొమ్మ వద్ద ఉన్న కాంపాక్టర్ బిన్ ను తొలగించి అక్కడ సుందరీకరణ చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో డంప్ సైట్లను గుర్తించి వాటిని తొలగించాలని, కాలువలలో సిల్టు తొలగించాలని ఆదేశించారు. జూబ్లీ రోడ్లో నిర్మాణ దశలో ఉన్న భవనాలను పరిశీలించి వాటికి ప్లాన్లు ఉన్నది లేనిది గుర్తించి తెలియజేయాలని వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ వారికి ఆదేశించారు.

ఫలించిన మంత్రి కొండపల్లి కృషి

విశాఖ-రాయపూర్ జాతీయ రహదారిలో తాటిపూడి సాగునీటి కాలువపై బాక్స్ కల్వర్టు నిర్మానికి ఆమోదం

విశాలాంధ్ర-విజయనగరం: సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విశాఖపట్నం రాయపూరు జాతీయ రహదారి కొర్లాం గ్రామపరిధిలో బాక్స్ కల్వర్టు నిర్మాణ సమస్యకు పరిష్కారం దొరికింది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. ఎన్నో ఏళ్ళుగా ఆ ప్రాంత ప్రజలు, ఆరు వందల ఎకరాలకు సాగునీటి కోసం ఉద్దేశించిన ఈ కల్వర్టు నిర్మాణం వల్ల మూడు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతుల సాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. కొర్లాం గ్రామ పరిధిలో చెరుకు కాటా దగ్గరలో ఉన్న డొంకలగడ్డ నుంచి జగన్నాథపురం వెళ్లే తాటిపూడి ప్రాజెక్టు ఇరిగేషన్ కెనాల్ నీటి ప్రవాహం కోసం గతంలో పైప్ లైన్ కల్వర్టు ఉండేది. రెండు వరుసల రహదారిగా ఉన్న ఈ జాతీయ రహదారి, గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి గా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఈ కల్వర్టును బాక్స్ కల్వర్టు నిర్మించాలని స్థానిక రైతులు గత సంవత్సర కాలంగా ఆందోళన చేస్తున్నారు . ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులను సంప్రదించి ఈ ప్రాంతంలో బాక్స్ కల్వర్టు నిర్మాణానికి ఒప్పించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ నుంచి బాక్స్ కల్వర్టు నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ కల్వర్టు నిర్మాణానికి ఆమోదం లభించడం పట్ల స్థానిక రైతులు, ఆప్రాంత ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనధికార నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : అనధికార నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం 50వ డివిజన్ వైయస్సార్ నగర్ లో ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. వైయస్సార్ నగర్ లో అత్యధికంగా అనధికార నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే కొన్ని ఇళ్ల ముందు కాలువలను ఆక్రమించి షెడ్లు వేసినట్లు గమనించారు. వీటిని తక్షణమే తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఇంకుడు గుంతలు ప్రతి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కాలువల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలియచెప్పడంతో అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి భవిష్యత్తులో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని కమిషనర్ వారికి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహక రించాలని కోరారు. పన్నులు ఏగవేత దారులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలు చెల్లించిన పన్నులతోనే నగరాన్ని అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలప్రకారం ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించవలసిందేనని అన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండు సచివాలయాలు అందని సేవలు

విశాలాంధ్ర-భోగాపురం: మండల కేంద్రమైన భోగాపురంలో రెండు సచివాలయాలు ఉన్న సేవలందిని పరిస్థితి నెలకొంది. రెండు సచివా లయాల్లోనూ డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో వివిధ పనుల కోసం సచివాలయానికి వెళ్లిన వారందరూ అసహనంతో వెనక్కిమల్లారు. ఒకటవ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గూడెపువలస ఆధార్ క్యాంపు నకు వెళ్లారని, రెండో సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గత మూడు రోజుల నుంచి సెలవులో ఉన్నారని మిగతా సిబ్బంది చెప్పడంతో అక్కడికి వెళ్లిన వారు అవాక్కయ్యారు. భోగాపురంలో సచివాలయాలకు తిరగడం తప్ప డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనులు జరగలేదని, ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ప్రభుత్వం సచివాలయాలను ఏర్పరిస్తే , ఇక్కడ అసౌకర్యం రాజ్యమేలుతుందని ప్రజలు వాపోయారు. రెండవ సచివాల యంలో డిజిటల్ అసిస్టెంట్ శెలవు లో ఉన్నప్పుడు ఉన్న ఒక్క డిజిటల్ అసిస్టెంట్ ను ఆధార్ క్యాంపు కోసం ఎలా పంపిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతీ రోజు చాలామంది మండలం నుంచి మండల కేంద్రానికి వచ్చి వివిధ పనులపై సచివాలయాలుకు వస్తారని ఇక్కడ సరిగా సేవలు అందక పోతే ఎలా అని ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరించడం దారుణం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయాలలో నిరాటకంగా సేవలు అందించాలని కోరుతున్నారు

చిట్టీల కేసులో నలుగురు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర-భోగాపురం :-చిట్టీలు వేసి ప్రజలను మోసగించిన నలుగురు వ్యక్తులను భోగాపురం పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. భీమిలికి చెందిన అలిపిలి అరుణ్ కుమార్, కొమర కనకమహాలక్ష్మి, తగరపోసుకు చెందిన చోడిపిల్లి సంధ్యారాణి, గాజువాక కు చెందిన తోడిపల్లి ప్రభు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. చెరుకుపల్లి గ్రామానికి చెందిన పలువురు వీరి వద్ద చిట్టీలు కట్టారు. తిరిగి సొమ్ము చెల్లించకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు విశాఖపట్నంలో వీరిని ఎస్సై సూర్య కుమారి బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

అన్నదాత సుఖీభవ

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో కలవచర్ల గ్రామం చిరంజీవి మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు తల్లి రాజ్యలక్ష్మి తండ్రి భూషణ్ రావు మాతృభూమి సేవ సంఘం ద్వారా విజయనగరం వుడా కాలనీలో ఉన్న శారది వెల్ఫేర్ విజిబుల్ ఈ ఛాలెంజ్డ్ బ్లైండ్ హాస్టల్ నందు భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది ఆశ్రమ నిర్వాహకులు, మాతృభూమి సేవ సంఘం కుటుంబ సభ్యులు మోక్షజ్ఞ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విద్యా బుద్ధులతో కలకాలం జీవించాలని కొనియాడారు.

టూరిజం హోటల్స్ ఏర్పాటుపై ఐహెచ్‌సిఎల్ బృందం పరిశీలన

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు టాటా సంస్థకు చెందిన ఐ హెచ్ సి ఎల్ ఆసక్తి కనబరుస్తోంది. ఈ సంస్థ ప్రతినిధుల బృందం గురువారం జిల్లాలో పర్యటించి పలు ప్రాంతాల్లో పర్యాటక హోటల్స్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేసింది జిల్లా అధికారులతో మాట్లాడి హోటల్స్ ఏర్పాటుకు గల అవకాశాలను తెలుసుకుంది. ఐ హెచ్ సి ఎల్ గ్రూపు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ రానడే నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం గురువారం జిల్లాలో పర్యటించి, పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించింది. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తో కలిసి ఈ బృందం సభ్యులు తొలుత భోగాపురం ఎయిర్పోర్ట్ లో భాగంగా ఏర్పాటు చేయనున్న ఏరోసిటీని సందర్శించింది. ఆ ప్రాంతంలో పర్యాటక హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి జిల్లాలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. భోగాపురం ఎయిర్ పోర్టు తో పాటు జిల్లా కేంద్రంలోనూ, తాటిపూడి రిజర్వాయర్ వంటి ప్రదేశాల్లోనూ హోటల్స్ రిసార్టులు ఏర్పాటు చేస్తే పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో హోటల్స్ రిసార్టులు ఏర్పాటు కోసం ముందుకు వస్తే అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రోత్సహిస్తామని కలెక్టర్ తెలిపారు. భోగాపురం నుంచి మధురవాడ వరకు ఐటి హబ్ గా అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం వుందని, అందువల్ల ఈ ప్రాంతం హోటల్స్, రిసార్ట్ లు ఏర్పాటుకు అనువైన ప్రదేశమని ప్రతినిధి బృందానికి కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు ప్రతి బృందం సభ్యులకు బొబ్బిలి వీణ అందించి సత్కరించారు. అనంతరం బృందం సభ్యులు తాటిపూడి జలాశయం ప్రాంతాన్ని పరిశీలించారు ఈ పర్యటనలో జిల్లా పర్యటక అధికారి లక్ష్మీనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, ఏపీ ఈ డి బి ప్రతినిధి రామేశ్వర్ ఏ పి టి ఏ ప్రతినిధి రాంప్రసాద్ ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా 716 ఫిర్యాదులు

తాసిల్దార్ రాజారావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలంలో నిర్వహించిన గ్రామసభల ద్వారా 716 రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులు అందాయని చీపురుపల్లి తాసిల్దార్ ఎన్. రాజారావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 18 నుండి ఈనెల 4 వరకు చీపురుపల్లి మండలంలోని 13 గ్రామాలలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో భూములు రీ సర్వే జరిగిన గ్రామాల్లోనే గ్రామ సభలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సభలలో ఎక్కువ శాతం రైతుల నుండి ఫిర్యాదులు అందే అన్నారు. సర్వేలు జరిగినప్పటికీ తమ భూములు తమ పేరుతో నమోదు కానట్లు ఎక్కువ శాతం ఫిర్యాదులు అందాయి అన్నారు. వారసత్వంగా వస్తున్న భూములు సైతం వారసులపేరుతో నమోదు కాకపోవడం వల్ల రీ సర్వే జరిపినప్పటికీ ఉపయోగకరం లేకుండా పోయిందంటూ రైతుల ఫిర్యాదు చేశారన్నారు. రెవెన్యూ పరిభాషలో జాయింట్ ఎల్ పి ల పైన ఫిర్యాదులు అందడంతో సబ్ డివిజన్ చేయుట కొరకు దృష్టి సారిస్తున్నమన్నారు. ఇప్పటివరకు జరిగిన గ్రామసభల ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించమన్నారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే గ్రామ సభల ద్వారా వచ్చిన ఫిర్యాదుల పైన దృష్టి సారించి రైతుల భూ సమస్యల పరిష్కారమునకు కృషి చేస్తామన్నారు. రీ సర్వేలు జరిపినప్పటికీ ఎవరి పేరుతో ఉన్న భూములు వారి పేరుతో నమోదు కాకపోవడం వలన రైతుల ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించిన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తమ బృందం పరిశీలన జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు జారీ అయిన వెంటనే పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం నకు కృషి జరుపుతామని ఆయన వివరించారు.

అవగాహనతోనే క్యాన్సర్ ను జయించగలం..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: అవగాహనతోనే క్యాన్సర్ ను జయించగలమని డాక్టర్ మానస తెలిపారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా కొట్టం పీహెచ్సీ డాక్టర్ జె హారిక ఆదేశాల మేరకు గురువారం మండలంలో గల అన్ని హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాల సిబ్బంది, సిహెచ్‌ఓలు, ఏఎన్ఎంలతో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాన్సర్ పై అవగాహనతోనే ముందుగా గుర్తించగలమని ఆమె తెలిపారు. అనంతరం క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ, అపూర్వ, ఏఎన్ఎం కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ రామక్రిష్ణ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొరు.

మట్టి తవ్వకాలు చేసిన కొండను పరిశీలించిన రెవెన్యూ

విశాలాంధ్ర-జామి: మండలంలోని భీమసింగి రెవెన్యూలో ఉన్న చిల్లపాలెం కొండను రాత్రి పూట త్రవ్వకాలు చేసి మట్టి తరలించుకుపోయిన ప్రదేశాన్ని గురువారం తహశీల్దార్ ఐ.కృష్ణలతతోపాటు ఆర్‌ఐ సృజన, ఎంఎస్‌వో ఖాదర్, విఆర్‌వో హరనాథ్, విఎస్ రాంబాబులు పరిశీలించారు. మట్టి మాఫియా చేస్తున్న త్రవ్వకాలపై విశాలాంధ్రలో గురువారం ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించి నివేదిక ఇవ్వాలని మండల అధికారులను ఆదేశించారు. ఈమేరకు త్రవ్వకాలు జరిగిన ప్రాంతంలో పరిశీలన చేసారు. మట్టి ఎవరు త్రవ్వకాలు చేసారో గుర్తించాలని తహశీల్దార్ సిబ్బందిని ఆదేశించారు.

ఉద్యమించిన వాలంటీర్లు

వాలంటీర్ల కోసం అసెంబ్లీలో ప్రకటించండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లందరికి న్యాయం చేస్తామని చెప్పిన మాటలు నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో వాలంటీర్లు సహకారం కూడా ఉన్నది కాబట్టి అసెంబ్లీ సమావేశాల్లో గ్రామ, వార్డు వాలంటీర్లను కొనసాగిస్తున్నట్లు ప్రకటన చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఉద్యోగం, ఉపాధి రాజ్యాంగంలో కలిపించబడిన హక్కుని కాలరాయవద్దు అని విజయనగరంలో ఏ.పి గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధర్యంలో వాలంటీర్లు అందరూ కలిసి ర్యాలీగా వెళ్ళి విజయనగరంలో స్థానిక అంబేద్కర్ జంక్షన్ (బాలాజీ జంక్షన్) లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించి మానవహారం నిర్వహించి ముఖ్యమంత్రి గారూ వాలంటీర్లు కి మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోండి అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మీడియాలో మాట్లాడుతూ 2019 లో సచివాలయ వ్యవస్థ కంటే ముందుగానే వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతి యువకులను వాలంటీర్లుగా నియమించి వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను ప్రజల వద్దకు చేరవేడయంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా సేవలు చేయడం జరిగిందనీ అందరికీ తెలిసిన విషయమే అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తె వాలంటీర్లను కొనసాగిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు చేయకపోవడం వల్ల వాలంటీర్లు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని మరచిపోకుండా వాలంటీర్స్ అందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇప్పించాలని, గత 6 నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాన్ని విడుదల చేయించాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వాలంటీర్లను మన్నించి తిరిగి విధుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము. 11వ తేదీ నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో వాలంటీర్లుకి న్యాయం జరగకపోతే ఏఐటీయూసీ వాలంటీర్లకు అండగా నిలబడి వాళ్ళని న్యాయం జరిగే వరకూ దశల వారీ పోరాటాలకు కార్యాచరణతో వెళ్ళక తప్పదనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రవీంద్ర, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరియు రూరల్ లో వార్డు, గ్రామ సచివాలయల నుంచి బొండపల్లి మొదలైన మండలాల నుంచి జిల్లా వ్యాపితంగా వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-గుర్ల: గుర్ల సబ్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి లెవెన్ కె.వి పాలవలస ఫీడర్ పై లైను లైన్ కింద ఉన్న చెట్లు కొట్టుటకు, మెయింటినెన్స్ పని నిమిత్తము విద్యుత్ అంతరాయము పై గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు గరికివలస, గోవుపేట, కొండగంటేడు, వకీరుకితలు, ముద్దాడపేట, మునకాల పేట, గేదల పేట, బూర్లు పేట గ్రామంలో కు విద్యుత్ అంతరాయం కలుగును ఈ విషయము విజయనగరం డివిజనల్ ఇంజనీర్ ఈ త్రినాధరావు తెలియజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు శంబంగి వైసీపీ అభ్యర్థిగా నామినేషన్

విశాలాంధ్ర -విజయనగరం/బొబ్బిలి: శాసనమండలి స్థానిక సంస్థల నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో గురువారం ఒక నామినేషన్ దాఖలు అయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ కు మధ్యాహ్నం 1-40 గంటలకు ఆయన తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎస్.వి.చిన అప్పల నాయుడుతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస్ మూర్తి తదితర అధికారులు నామినేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. శంబంగి నామినేషన్ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నెక్కలి నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

శునకాలు బాబోయ్..

విశాలాంధ్ర-విజయనగరం పోర్ట్: కొత్తవారు ఆ ప్రాంతానికి వస్తే గాయాలతో వెళ్లాల్సిందే.. అక్కడ వీధిలో తిరగాలంటే స్థానికులు భయపడుతున్నారు 15వ వార్డులో, బాబామెట్ట ఏడుకోవెల దగ్గర వాసులను శునకాలు హడలెత్తిస్తున్నాయి. పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ.. దాడులకు తెగబడు తున్నాయి. చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు భీతిల్లుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు భయం గుప్పెట్లో పెట్టుకుని గమ్యస్థానాలు చేరుతున్నారు. పలువురు వీటి దాడులతో గాయాల బారిన పడ్డారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎంపిడిఓకు షోకాజ్ నోటీసు

విశాలాంధ్ర-విజయనగరం: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు గాను బోగాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిషోర్ కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారి, జాయింట్ కలెక్టర్ షో కాజ్ నోటీసు జారీచేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ఈ విషయం తెలిపారు.

టూరిజం అభివృద్ధికి తాటిపూడి డ్యాం పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-గంట్యాడ: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చొరవతో గురువారము ఇండియన్ హెూటల్స్ కంపెనీ లిమిటెడ్ ముంబై అసోసియేటెడ్ చైర్మన్ రోషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి ఆంధ్రప్రదేశ్ స్టేట్ టూరిజం ఎస్టేట్ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ వైజాగ్ టూరిజం హబ్ మరియు విజయనగరం టూరిజం ఆఫీసర్ లక్ష్మీనారాయణ తాటిపూడి రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను టూరిజం డెవలప్మెంట్ కోసం ప్రణాళికల రూపొందించడానికి పరిశీలన చేయడం జరిగినది. వీరితో పాటు గంట్యాడ తాసిల్దార్ నీల కంఠేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మురుగునీటి కర్మాగారాలను నిర్మించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం : మున్సిపాల్టీల్లో మురుగునీటి కర్మాగారాల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వీటి ద్వారా పట్టణాల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. పురపాలక సంఘాల్లో చెత్త నిర్వహణ, ఎస్‌టిపిల నిర్మాణంపై (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ తమ ఛాంబర్‌లో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విజయనగరంలో పెద్దచెరువు వద్ద 5 ఎంఎల్‌డిల సామర్థ్యంతో సుమారు రూ.23కోట్ల అంచనా వ్యయంతో ఐదేళ్ల క్రితం ఎస్‌టిపి నిర్మాణం చేపట్టినప్పటికీ నేటికీ పూర్తి కాలేదని చెప్పారు. కేవలం 23 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. అదనంగా మరో రూ.16.83కోట్లతో సవరించిన అంచనాలను ఇటీవలే ఈఎన్సికి పంపించడం జరిగిందని, టెంటర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. బొబ్బిలి మున్సిపాల్టీలో 3 ఎస్‌టిపిలు, 5 ఎన్ఎస్‌టిపిలు, నెల్లిమర్ల నగర పంచాయితీలో 4 ఎంఎల్‌డిల సామర్థ్యంతో 1.6 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదిత ఎస్‌టిపి, రాజాం మున్సిపాల్టీలో 3 ఎస్‌టిపిలు, 7 ఎన్ఎస్‌టిపిల నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలపై సమీక్షించారు. వీటిని తక్షణమే భూసేకరణ పూర్తి చేసి, వీలైనంత త్వరగా నిర్మాణాన్ని ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, బొబ్బిలి కమిషనర్ ఎల్.రామలక్ష్మి, రాజాం కమిషనర్ జె.రామప్పలనాయుడు, నెల్లిమర్ల కమిషనర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం, అమ్మి గారి కోనేరు గట్టుకు చెందిన ఫిర్యాది సుమల జ్యోతి అనే వ్యక్తి తన తన అన్నయ్య సుమల దత్తు (26) సంవత్సరాలు, దిబ్బ వీధి ఆదివారం అనగా ఈనెల 5న, తన మోటార్ సైకిల్ పై బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పట్టణంలోని సంత తోట కాలనీ వద్ద మొటారు సైకిల్ అదుపు తప్పి ప్రమాదం జరిగిందని వైద్యం కోసం బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు .చికిత్స తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు అయితే మరుసటి రోజు మధ్యాహ్నం చాతి కింద రగుడు గాయం వలన ఎక్కువ నొప్పి రావడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అదే రోజు సాయంత్రం ఐదు గంటల సమయంలో మృతి చెందినట్లు పట్టణ సీఐ సతీష్ కుమార్ మృతుడు తమ్ముడు ఫిర్యాదు చేయడంతో ,ఎస్సై టి. శ్రీహరి కేసు నమోదు చేసి, పంచాయతీ దారుల సమక్షంలో శవ పంచినామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు..

పట్టణ ప్రణాళికా విభాగంలో రాజకీయ ప్రమేయాన్ని అరికట్టాలి

లోక్‌సత్తా డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: ఏ ప్రభుత్వ శాఖలో అయినా రాజకీయ నాయకులు తమ పరిధి దాటి జోక్యం చేసుకుంటే ఆ శాఖ తప్పని సరిగా అవినీతి మయం అయ్యే అవకాశం ఉందని రాజకీయ నాయకుల ప్రమేయం తగ్గించాలని అందుకు సంబంధించిన శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి మునిసిపాలిటీలోని, బొబ్బిలి-బలిజిపేట రహదారి విస్తరణలో బొబ్బిలి మునిసిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇచ్చిన టీడీఆర్ బాండ్ల జారీలో పారదర్శకత లోపించిందని విజిలెన్స్ అధికారులు కొన్ని దస్త్రాలు తీసుకెళ్లడం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశం అయిందిని అన్నారు.అలాగే రెండేళ్ల కిందట అవినీతి నిరోధక శాఖ అధికారులు బొబ్బిలిలోని పలు బహుళ అంతస్తుల భవనాల ప్లాన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించి, యజమానులకు నోటీసులు జారీ చేసారు, ఆసుపత్రి రహదారిలోని ఓ భవన నిర్మాణాన్ని కొంత కూల్చమని ఆదేశాలిచ్చారు. అప్పుడు కూడా బొబ్బిలి మునిసిపాలిటీ పట్టణ ప్రణాళికా విభాగంపై ప్రజలలో చాలా సందేహాలు కలిగాయని, ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు అధికారులని, పాలకులని తిట్టుకుని అంతా అవినీతి అయిపోయిందని అనుకోవడమే గాని దిద్దుబాటు చర్యలు తీసుకోకపోవడం వలన ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి అని ఆయన అన్నారు. మునిసిపల్ పట్టణ ప్రణాళికా విభాగంలో రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యం, రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం, అధికారులపై సరియైన పర్యవేక్షణ లేకపోవడం, తప్పు చేసిన అధికారికి సరియైన శిక్షలు పడకపోవడం మొదలైన కారణాల వలన మున్సిపాలిటీకి చెడ్డపేరు వస్తుంది. అవినీతి చేసే కొందరి వలన మొత్తం అధికార యంత్రాగాన్నే ప్రజలు తిట్టుకునే పరిస్థితి. బొబ్బిలిలో మనం గమనిస్తే నిబంధనలకు విరుద్ధంగా భవనాలు కట్టుకోవడానికి చాలా చోట్ల అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారో అనే అనుమానాలు కలగక మానదు. ఉదాహరణకు అమ్మిగారి కోనేటి గట్టు పై నిర్మాణాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆనుకుని నిర్మాణాలు, యుద్ధసంభం దగ్గర నిర్మాణాలు, అలాగే ఇందిరమ్మ కాలనీలోని నిర్మాణాలను అధికారులు ఎలాంటి పక్షపాత ధోరణి చూపించకుండా పక్కా సర్వే చేస్తే అక్కడే చాలా అక్రమ నిర్మాణాలు వెలుగు చూస్తాయి. అమ్మిగారి కోనేటి గట్టు మీద కట్టిన ఇళ్ల తాలూకా వాడుక నీరు బొబ్బిలి-బలిజిపేట రహదారిపై వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారుల చర్యలు శూన్యం. మరి ఇలాంటి నిర్మాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారంటే ఏ రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా ఇచ్చే అవకాశం ఉందా? వీటిపై ప్రతి కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీ వారు వాదులాడు కోవడమే తప్పా వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మరి దీనిని ఏమనుకోవాలి? అన్నీ ఆ తాను ముక్కలే కదా. ప్రజలు కూడా అదే అనుకుంటున్నారు. ఒక రాజకీయ నాయకుడు కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే పదవిలో ఉంటాడు, అతను ప్రజలకు ఉపయోగపడే మంచి పనులు చేస్తే ప్రజలు తిరిగి అధికారం ఇస్తారు. అదే ప్రభుత్వ ఉద్యోగి ముప్పై సంవత్సరాలు సర్వీసులో ఉంటాడు, ఆయన రాజ్యాంగ బద్దంగా ప్రజల కోసం పనిచేస్తే ప్రజల తమ జీవిత కాలం గుర్తుంచుకుంటారు. అందుకు మన బొబ్బిలి మునిసిపాలిటీలోనే పాలిథీన్ నిషేదం కోసం కృషి చేసిన కరుణాకరం ప్రసాద్ గారు అని చెప్పవచ్చు. ఇదే మున్సిపాలిటీలో అధికార పార్టీ నాయకులు చెప్పినట్టు తల ఊపి పూర్తి అవినీతిలో కూరుకుపోయి ఉద్యోగం పోగొట్టుకున్న అధికారి ఉన్నారని అన్నారు. ఏది కావాలో తేల్చు కోవలసింది ప్రభుత్వ ఉద్యోగులే. ఇలాంటి పరిణామాలు చూసైనా మన మునిసిపల్ అధికారులు రాజ్యాంగ బద్దంగా పనిచేసి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా ప్రజలకు చక్కని సేవలు అందించి బొబ్బిలి మునిసిపాలిటీకి మంచి పేరు తెచ్చేందుకు కృషి చెయ్యాలని లోక్ సత్తా పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక నైపుణ్యంతో సైబరు నేరాలను చేధించవచ్చు

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కంప్యూటరు నైపుణ్యం, మెలుకువలతో సైబరు మోసాలను సులువగా చేధించవచ్చునని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ అన్నారు. జె.ఎన్.టి.యు. ఇంజనీరింగు కాలేజ్లో నిర్వహించిన 'సైబరు నేరాల దర్యాప్తు' కు చేపట్టాల్సిన మెళుకవులు, సాధించాల్సిన నైపుణ్యంకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - ప్రస్తుతం నేరాల తీరు మారుతున్నదని, ప్రతీ నేరం కూడా సైబరు క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉంటున్నదన్నారు. ఈ నేరాలను చేధించేందుకు దర్యాప్తు అధికారులకు కూడా ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణం అవసరమన్నారు. వృత్తి నైపుణ్యంను మెరుగుపర్చుకుంటే రాబోయే రోజుల్లో సైబరు నేరాల దర్యాప్తు సులభతరం అవుతుందని, సైబరు మోసాలకు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, చట్ట పరిధిలో శిక్షించడంతోపాటు, వారు దోచుకున్న నగదును తిరిగి రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు దర్యాప్తు అధికారులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకుగాను సైబరు నిపుణులు సాయి రామానుజ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కావున, సైబరు మోసాల, నేరాల కేసులను దర్యాప్తు చేసే అధికారులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని,

సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని, భవిష్యత్తులో పోలీసుశాఖకు పెను సవాలుగా నిలిచే సైబరు క్రైంకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అన్నారు. సైబరు మోసాల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దన్నారు. చాలామంది అత్యాశతోను, అవగాహన లోపంతో సైబరు మోసాలకు గురవుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ సైబరు మోసాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని, క్షేత్ర స్థాయిలో తాము కూడా మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామ సందర్శనచేసే సమయాల్లో ప్రజలతో మమేకమై, సైబరు మోసాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. సైబరు నిపుణులు సాయి రామానుజ మాట్లాడుతూ - సైబరు నేరాలను, మోసాలను చేధించడం చాలా సులభమని, అందుకు అవసరమైన అవగాహన, వృత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసరమన్నారు. కొన్ని మెళుకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించగలిగితే చాలా సైబరు మోసాలను చేధించ వచ్చునన్నారు. సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ వేదికగా జరుగుతున్న వేధింపులు, ఓ.టి.పి. ఫ్రాడ్స్, ఆర్థిక మోసాలు, మొబైల్ లోను యాప్స్ వంటి నేరాల్లో దర్యాప్తు ఏవిధంగా చేయాలి, సాక్ష్యాలను ఏవిధంగా సేకరించాలి, నిందితులను ఏవిధంగా గుర్తించాలన్న విషయాలను పోలీసు అధికారులకు చక్కగా వివరించారు. సైబర్ కేసుల దర్యాప్తులో వ్యవహరించాల్సిన తీరును, ఐపి అడ్రసులు, నిందితులను గుర్తించుకుటకు మెళుకవలను తెలియజేసి, కేసుల దర్యాప్తులో తన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా, ఎప్పుడైనా తనకు ఫోను చేసి, అవసరమైన సహాయాన్ని పొందవచ్చునన్నారు. అనంతరం, సైబరు నిపుణులు సాయి రామానుజని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సాలువతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, పార్వతీపురం మన్యం అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, ఇరు జిల్లాలకు చెందిన పలువురు సిఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాను బైకు ఢీ కొని వ్యక్తి మృతి

తాడ్డి రాంబాబు (ఫైల్)

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో గర్భాం బైరిపురం మార్కెట్ యార్డ్ మలుపు వద్ద 5వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో 40ఇ సి 5203 బైకు ను వ్యాను బలంగా ఢీకొనడంతో గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి రాంబాబు (42) దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోనికి వెళ్ళగా బుధ రాయవలస ఎస్సై జె లోకేష్ కుమార్ మరియు కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల ప్రకారం బైరిపురం నుండి గర్భాం వైపు బైక్ పై వస్తున్న రాంబాబును అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ వస్తున్న పాల వ్యాను ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలు అయ్యాడు. అనంతరం చికిత్స నిమిత్తం విజయనగరం తిరుమల ఆసుపత్రికి తరలించగా 6వ తేదీ సాయంత్రం ఆసుపత్రిలో కన్నుమూశాడు. రాంబాబుకు భార్య మరియు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధ రాయవలస ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సేవలోనే సంతృప్తి

విశాలాంధ్ర-రామభద్రపురం : సామాజిక సేవలోనే సంతృప్తి ఉంటుందని విశ్రాంతి తాసిల్దార్ చ ప్ప రామారావు అన్నారు. గురువారము మండల కేంద్రంలో శిరిడి సాయి మందిరం వద్ద వందమంది నిరుపేదలకు చలికాలం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు నెల నెల తనకు వచ్చే పించను డబ్బుల్లో కొంత సొమ్మును పోగు చేసి ప్రతి సంవత్సరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మానవసేవయే మాధవ సేవ అని అన్నారు.

ఘనంగా నరసింహ స్వామి వారి కళ్యాణం

విశాలాంధ్ర-జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వున్న కళ్యాణ్ నగర్ లో వున్న శ్రీ ఐశ్వర్య లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి కళ్యాణం గురువారం ఘనంగా జరిగింది. అర్చకులు ప్రసాద్ స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసారు. వేదమంత్రల మధ్య భక్తులు గోవింద నామస్మరణ తో అలయ ప్రాంగణం మారుమోగ్రింది. స్వామి వారి ని దర్శించుటకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ గా తరలివచ్చారు.

ధాన్యం కొనుగోలు పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : శృంగవరపుకోట మండలం ఎస్ జి పేట గ్రామంలో రైతు సేవా కేంద్రం ఎందు ధాన్యం కొనుగోలు పై అవగాహన కార్యక్రమాన్ని రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రవీంద్ర మాట్లాడుతూ పంట నూర్చిన తర్వాత ధాన్యంలో తేమ %ఓ% నిమ్మ 17% ఉండవలసిందిగా రైతులు చూసుకోవాల్సిందిగా కోరారు. అదేవిధంగా నాణ్యత ప్రమాణాలు పాటించవలసిందిగా కోరారు మరియు గోను సంచులు రవాణా చార్జీలు కూలీ ఖర్చులు గురించి రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో రవీంద్ర తోపాటు వి ఏ ఏ రవి, గ్రామస్తులు రైతు సోదరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు సీతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & డేటా సైన్స్ విభాగానికి చెందిన సి.హెచ్. యశస్విని అనే విద్యార్థిని అక్టోబర్ నెలలో ఎం.వి.జి.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాల తైక్వాండో పోటీల్లో తనదైన మిక్కిలి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జేఎన్టీయూ గురజాడ విజయనగరం జట్టుకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి తెలియజేశారు. అంతేకాకుండా ఈనెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోనే అమృత్సర్ లో ఉన్న గురునానక్ యూనివర్సిటీలో జరగబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యాన్ని ప్రదర్శించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ తమ తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని యశస్వినికి అభినందనలు తెలియజేశారు. కళాశాల కల్పించిన మౌలిక సదుపాయాలు శిక్షణ నా విజయానికి కారణమని ఈ సందర్భంగా విద్యార్థిని తెలిపారు.ఈ క్రీడాభినందన సభలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగాధిపతి రాధ, ఫిజికల్ డైరెక్టర్స్ మహేశ్వర రావు, శ్రీదేవి,సి.ఎస్.ఓ సత్యనారాయణ, అధ్యాపకులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు 30% మధ్యంతర భృతి తక్షణమే ప్రకటించాలి

ఎస్‌టియు డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉద్యోగులకు 30 శాతం మద్యాంతర భృతి తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కే జోగారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అమర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు తక్షణమే మధ్యంతర భృతి తక్షణమే ప్రకటించాలని, 12వ పి.ఆర్.సి కమిషన్ ను తక్షణమే నియమించాలన్నారు. జీవో నెంబర్ 117 పూర్తిస్థాయిలో రద్దు చేయాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు మాట్లాడుతూ ఎఫ్ ఎల్ ఎన్ రెసిడెన్షియల్ ట్రైనింగును రద్దుచేసి కాంప్లెక్స్ లెవెల్ లో ఉపాధ్యాయులకు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు పని సర్దుబాటును సరిచేసి ఉపాధ్యాయులను నియమించాలన్నారు.బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్లను రద్దు చేయాలని,సిపిఎస్ ,జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు వి గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ చిట్టిబాబు, అప్పలస్వామి, జిల్లా కార్యదర్శులు ఎస్ బంగారయ్య, జి.రవి,బి అడవియ్య, అదనపు కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

రీసర్వే డిసెంబర్ 15 నాటికి శతశాతం పూర్తి చేయాలి

కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగర పరిధిలో చేపట్టిన అర్బన్ రీసర్వే డిసెంబర్ 15 నాటికల్లా శతశాతం పూర్తి చేయాలని కమిషనర్ పి.నల్లనయ్య సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గురువారం ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన అర్బన్ రీసర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్బన్ రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం రీసర్వే పూర్తయిందన్నారు. అయితే మరింతగా కృషి చేసి డిసెంబర్ 15 నాటికి శతశాతం రీసర్వే పూర్తి కావాలన్నారు. ప్రణాళిక, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో రీసర్వే సమర్థవంతంగా చేపట్టాలన్నారు. రీసర్వే నిర్వహణలో నిర్లక్ష్యం గా వహించిన వారి పట్ల కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రీసర్వే చేపట్టే విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఐవీ రమణమూర్తి, ఎల్. హరిబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వోలు, పరిపాలన, ప్రణాళిక, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రజల బ్యాంకు ఎకౌంటులతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృతంలో ప్రజల బ్యాంకు ఎకౌంటులతో ఆధార్ అనుసంధాన ప్రక్రియను సచివాలయ సిబ్బంది ముమ్మరం చేశారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య సూచనలతో ప్రతి సచివాలయ పరిధిలో కార్యదర్శులు ప్రజల అకౌంట్లను అనుసంధానిస్తున్నారు. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం నుండి మంజూరయ్యే ఆర్థికపరమైన అంశాలు సులభతర రీతిలో జరిగేందుకు ఎన్.పి.సీ.ఐ విధానం శ్రేయస్కరమని ఆయన పేర్కొన్నారు.

2వేల మందితో అన్నసమారాధన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో జగన్నాధవలస గ్రామంలో శాలివాహన యువజన సంఘం ఆధ్వర్యంలో నందెన్న ఉత్సవాల్లో భాగంగా నాగుల చవితి రోజు. నందీశ్వరుని నిమజ్జనం గావించిన సందర్భంగా ఈరోజు అన్న సమారాధనసుమారు 2000 మంది తో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో జగన్నాథ వలస గోపాలవలస పెరుమాలి .భక్తులు గ్రామ పెద్దలు పాల్గొనడం అయినది కార్యక్రమం నిర్వహించారు.

విలువండి శ్రీదేవికి న్యాయం జరిగే వరకు జనసేన పోరాటం

జనసేన చీపురుపల్లి ఇంచార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురువల్లి గ్రామం నకు చెందిన ఎరుబండి శ్రీదేవి కి న్యాయం జరిగేంతవరకు జనసేన పార్టీ పోరాటం చేస్తుందని జనసేన పార్టీ చీపురుపల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ విసిరి శ్రీనివాసరావు తెలిపారు.. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి గ్రామానికి చెందిన ఎరుబండి శ్రీదేవి కొనుగోలు చేసిన భూమి ని కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకొని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని అన్నారు.. ఎరుబంటి శ్రీదేవి తనకు జరిగిన అన్యాయంపై మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన జనవాణి కార్యక్రమంలో తన సమస్యను పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేసిందని ఆయన తెలిపారు. ఆమెకు సంబంధించిన కొనుగోలు భూమి పత్రాలు డాక్యుమెంట్లు అన్ని పరిశీలించిన తర్వాత జనసేన పార్టీ ఎమ్మెల్యే సదరు భూమి విషయంలో గరివిడి మండల తహసిల్దార్ కి గరివిడి మండల పోలీస్ శాఖ వారినీ వివరణ కోరి యూరు బండి శ్రీదేవి కి తక్షణమే న్యాయం చేయాలని సూచించారు అని విసనగిరి తెలిపారు. ఇదే విషయంపై రాష్ట్ర పార్టీ సూచన మేరకు గరివిడి తహసిల్దార్ గరుడు సబ్ ఇన్స్పెక్టర్ ను కలిసి న్యాయం చేయమని కోరినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి విసినిగిరి శ్రీనివాసరావు కోట్ల కృష్ణ లు స్థానిక గరివిడి మండల ఎమ్మార్వో ని కలిసి న్యాయబద్ధంగా ఈమెకు సంబంధించిన భూమి పత్రాలను అనుసరించి మ్యుటేషన్ చేయించి పాస్ బుక్ లు ఇప్పించచవలసిందిగా కోరారు.

నవంబర్ 10 న కార్తీక దీపోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : =ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో నవంబర్ 10వ తేదీన దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఎన్ సి ఎస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. దీపారాధన చేసేందుకు ఉచిత పాసులు విజయనగరం జిల్లా కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం కు చెందిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలోనూ, ఎన్ సి ఎస్ మల్టీప్లెక్స్ కార్యాలయంలోనూ, ఎన్ సి ఎస్ సినిమాథియేటర్లోనూ లభ్యం అవుతాయని పేర్కొన్నారు.

అనధికార మద్యం దుకాణాలపై దాడులు

విశాలాంధ్ర-భోగాపురం: అనధికార మద్యం దుకాణాలపై జరిపిన దాడుల్లో భాగంగా భాగంగా పూసపాటిరేగ మండలం తిప్పలవలస గ్రామానికి చెందిన మరుపల్లి అప్పన్న అనే వ్యక్తిని 29 మద్యం 180 ఎంఎల్ పరిమాణం గల బాటిల్స్ తో అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. అంతేకాకుండా ఈ నెల ఒకటవ తేదీ నుండి ఇప్పటివరకు అనధికార మద్యం దుకాణాలపై దాడుల్లో భాగంగా నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుండి మొత్తం 54 మద్యం బాటిల్స్ ని వారి నుండి స్వాధీనం చేసుకోవడం జరిగిందని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అనధికారి మధ్య దుకాణాలు నిర్వహించరాదన్నారు. అనధికారి మద్యం దుకాణాలు యొక్క సమాచారాన్ని భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ కు తెలపాలని కోరారు...

మలబార్ గోల్డ్ & డైమండ్స్ లో ఆర్టిస్ట్రీ - బ్రాండెడ్ జ్యువలరీ షో

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మలబార్ గోల్డ్ & డైమండ్స్ షోరూంలో గురువారం ఆర్టిస్ట్రీ" బ్రాండెడ్ జ్యువలరీ షో" ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శన చేపట్టింది. ఈ ప్రదర్శనలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తున్నట్లు షోరూం మేనేజర్ సురేష్ కుమార్ స్టోర్ హెడ్ రెహమాన్ తెలిపారు. ఈ ఆభరణాలు అద్వితీయమైన కళానైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడినమన్నారు. ప్రతి ఆభరణం తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనంగా నిలుస్తూ, ఈ షో యొక్క సందేశం బలపరుస్తున్నాయన్నారు. ఈ ఆర్టిస్ట్రీ షోని ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ నాయకులు డాక్టర్ అవునాపు భావన, వినియోగదారులు, శ్రేయోభిలాషులు, మలబార్ గోల్డ్ & డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ & డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించిన వజ్రాభరణాలు, వివాహం , పార్టీ సంబరాల కోసం, "ఎరా" అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, "ప్రెష్యా" జాతిరత్నాభరణాల సముదాయం, "ఎత్నిక్స్" హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, "జోల్" అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలను ఇష్టపడే మగువల మనసులు దోచుకుంటాయని తెలిపారు ."డివైన్" భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు ఇంకా చిన్నారుల కోసం "స్టార్లెట్" పిల్లల ఆభరణాలు సమకూర్చడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శన మలబార్ గోల్డ్ &డైమండ్స్ లో ఈనెల 7 నుండి 10 వరకు నిర్వహిస్తామన్నారు. విభిన్న వ్యాపార సమ్మేళనాలతో స్థాపించబడిన ప్రముఖ భారతీయ వ్యాపార సంస్థ మలబార్ గ్రూపు యొక్క ఫ్లాగ్షిప్ కంపెనీ మలబార్ గోల్డ్ %ఓ% డైమండ్స్. భారతదేశంలోని కేరళ రాష్ట్రంలో 1993 సంవత్సరంలో స్థాపించబడిన మలబార్ గోల్డ్ %ఓ% డైమండ్స్, నేడు 360కి పైగా షోరూములు, 14 హెూల్‌సేల్ యూనిట్లు, కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలు మరియు ఫ్యాక్టరీలతో భారతదేశం, ఆస్ట్రేలియా, కెనడా, యూకే, యూఎస్ఏ, మిడిల్ ఈస్ట్ మరియు ఫార్ ఈస్ట్ వంటి 13 దేశాల్లో బలమైన రిటైల్ నెట్‌వర్క్ కలిగి ఉన్నది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్లలో 6వ స్థానంలో నిలిచిందని తెలిపారు . డెలాయిట్ యొక్క గ్లోబల్ పవర్స్ ఆఫ్ లగ్జరీ గూడ్స్ 2023 ర్యాంకింగ్‌లో 19వ స్థానం కైవసం చేసుకుందన్నారు.